# ప్రజారాజ్యం

ప్రజలే ప్రభువులు

లోక్‌సత్తా 'ఇ' సమాచారపత్రం

సంపుటి : 1

సంచిక : 10

మే 16 -31 , 2006


# కన్నీటిలో కొల్లేరు - కనికరం లేని పాలకులు

## డా॥ జయప్రకాష్ నారాయణ్ కొల్లేరు పర్యటన

మా నోటికాడ కూడు పడగొట్టేస్తున్నారు... రక్షించండి అంటూ ఓ మహిళ ఆవేదన, మమ్మల్ని మళ్లీ గోచీగుడ్డ, తూటికూర తినే రోజులకు తీసుకు వెళ్తారంట మీరే మాకు దిక్కు ఆదుకోండంటూ మరో ప్రజా ప్రతినిధి వేడుకోలు... మా చెరువులన్నీ పాడు చేసేస్తున్నారు... ఇలాగైతే ఇక మేం చదువుకోలేం అంటూ ఓ విద్యార్థిని కంటతడి.. ఎక్కడ చూసినా వేదన, కళ్లల్లో దైన్యం. బాధతో బరువెక్కిన హృదయాలతో వచ్చి తమ గోడు పట్టించుకోండంటూ లోక్‌సత్తా జాతీయ సమన్వయకర్త డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ ను కొల్లేరు వాసులు చుట్టుముట్టారు. కొల్లేరు సమస్య అధ్యయనం కోసం రాష్ట్ర సమన్వయకర్త డి.వి.వి.ఎస్.వర్మతో కలిసి రెండు రోజులు కొల్లేరు గ్రామాల్లో డాక్టర్ జె.పి. పర్యటించారు. ప్రతీ గ్రామంలోనూ అధిక సంఖ్యలో ప్రజలు వచ్చి తమ గోడు వెళ్లబోసుకున్నారు. కన్నీళ్ల పర్యంతమవుతూ కాళ్లపై పడి తమ సమస్యలను వివరించారు. వారి వాదనలు, వేదనలతో సాగిన పర్యటన వివరాలు..



కొల్లేరు ప్రజల గోడు వింటున్న డా॥ జయప్రకాష్ నారాయణ్

## కలకుర్రు:

చెరువులు తప్ప తమకు ఆధారం లేదని చెరువులు ధ్వంసం చేసి తమను రోడ్డు మీద పడేయద్దంటూ పలువురు మహిళలు, గ్రామస్థులు లోక్‌సత్తా జాతీయ సమన్వయకర్త డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ ను కోరారు. చెరువులు ధ్వంసం చేయడంతో ఉపాధిలేక అనేక మంది ఇతర రాష్ట్రాలకు వలసపోతున్నారు. బాంబులు పెట్టి చెరువులు పేల్చడంతో ఇళ్లు కూడా నెర్రెలు బారి పోతున్నాయి. వెంగళరావు గారి పుణ్యమా అంటూ ఏదో మా బతుకులు మేం గౌరవంగా బతుకుతున్నాం. అవి కూడా లేకుండా చేస్తున్నారు.

**జె.పి: చెరువులు తవ్వకం వల్ల పైన పొలాలు ముంపునకు గురవుతున్నాయంటున్నారు కదా?**

గ్రామస్థులు: ముంపునకు కేవలం చెరువులు తవ్వడం ఒక్కటే సమస్య కాదు సార్. చెరువులు తవ్వక ముందుకూడా చాలా సార్లు పొలాలు మునిగిపోయాయి.

**జె.పి: సమస్య పరిష్కారానికి ఏం చేయాలంటారు?**

గ్రామస్థులు: ముంపునకు అడ్డు వచ్చే చెరువులు ఉంటే వాటిని మేమే స్వచ్ఛందంగా తీసేస్తామని చెబుతున్నా అధికారులెవరూ వినడం లేదు సార్. మా సొసైటీ భూముల్ని కూడా తీసుకుంటున్నారు. మాకేం తోచడం లేదు. మీరే దారి చూపించాలి.

**జె.పి: నా చేతిలో మంత్రదండం ఏదీ లేదు. మీ సమస్యలన్నీ తీరుస్తానని చెబితే అది మోసమే అవుతుంది. మీ సమస్యలు విని జరుగుతున్న పరిస్థితుల్ని అధ్యయనం చేయడానికి మాత్రమే వచ్చాను.**

## దేవి చింతపాడు:

దేవి చింతపాడులో మహిళలు, పురుషులు, పిల్లలు పెద్ద ఎత్తున తమ సమస్యలను వివరించేందుకు తరలి వచ్చారు. తమ ఆధారం పోగొట్టద్దంటూ మహిళలు కంటతడి పెట్టుకున్నారు. గతంలో అన్నం అంటే తెలియదు. ఇప్పుడిప్పుడే కాస్త బాగుపడుతున్నాం. మళ్లీ మమ్మల్ని పూర్వపు రోజుల్లోకి పంపించేస్తాననడం ఎంత వరకూ సమంజసం మీరే చెప్పండి సార్.



జె.పి: +5 కాంటూరులోపు ఎంతమంది జనాభా ఉంటారు.
గ్రామస్థులు: సుమారు లక్షమంది ఉంటారు.
జె.పి: డ్రెయిన్లకు అడ్డువచ్చే వాటిని ఏం చేస్తారు?
గ్రామస్తులు: స్వచ్ఛందంగా తొలగిస్తాం సార్.
జె.పి: కాంటూరుల సర్వే ఎప్పుడు జరిగింది?
గ్రామస్థులు: బ్రిటీష్ వారి కాలంలో జరిగింది. అది కూడా సరిగ్గా లేదు. మా రికార్డుల్లో ఒకలా ఉంది. అధికారులు చెప్పేది మరోలా వుంది.
జె.పి: అధికారులు ముందుగా ఇలా చేస్తున్నామని చెప్పారా?
గ్రామస్థులు: ఏం చెప్పలేదు సార్. పంచాయతీకి కూడా తెలియదు.

**డా॥ జయప్రకాష్ నారాయణ్**

**కొల్లేరు పర్యటన**

జె.పి: దేశంలో చదరపు కిలోమీటరు విస్తీర్ణంలో 350 మంది జీవిస్తుంటే ఇక్కడ చదరపు కిలోమీటరుకు 750 మంది జీవిస్తున్నారు. అందరి ప్రయోజనాలను కాపాడాలి. ఒకరి ఆనందం మరొకరికి నష్టం కలిగించకూడదు. ప్రత్యామ్నాయం చూపించాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద, పౌర సమాజం మీద ఉంది. 30ఏళ్ల వెనక్కి వెళ్లిపొమ్మనడం సరికాదు. సమాజంలో ప్రతీ ఒక్కరికి బతికే హక్కు ఉంది. ఉపాధి , ఆదాయం పొందే హక్కులు ఉన్నాయి. మీకేదో హామీలు ఇవ్వడానికి నేను ఇక్కడికి రాలేదు. సమస్యను ముందు అధ్యయనం చేయాలి. తర్వాత అందరం కలిసి పరిష్కారాన్ని ఆలోచిద్దాం.

### భుజబలపట్నం:

మా చెరువులను ధ్వంసం చేసి మమ్మల్నే దొంగలుగా చూస్తున్నారు. కనీసం మా చెరువులోని పుల్లను పట్టుకొచ్చినా కేసులు పెడతామంటున్నారు. ఇంతకంటే అన్యాయం ఇంకేమైనా ఉందా సార్. ఇప్పుడిప్పుడే మా పిల్లల్ని చదివించుకుంటున్నాం. ఇక మాపిల్లలు చదువులకు దూరం అవుతారు. కనీసం సరైన మంచినీళ్ల కూడా తాగడానికి లేవు.
జె.పి: మీ గ్రామంలో ఎన్ని సొసైటీలు ఉన్నాయి.
గ్రామస్థులు: నాలుగు సొసైటీలు ఉన్నాయి.



దేవి చింతపాడులో

జె.పి: ముంపు సమస్యకు పరిష్కారం ఏమనుకుంటున్నారు?
గ్రామస్థులు: ఛానలైజేషన్ చేయాలి సార్. డ్రెయిన్లకు అడ్డుగా ఉన్న చెరువులు ధ్వంసం చేయడానికి మాకు ఏమాత్రం అభ్యంతరం లేదు.

డా॥ జయప్రకాష్ నారాయణ్ కొల్లేరు పర్యటన

## పెంచికల్లమర్రు:

ప్రభుత్వం తమ ఉపాధిని పోగొట్టి గొర్రెలు, బాతులు ఇస్తామంటున్నారంటూ పెంచికల్లమర్రులో మహిళలు వాపోయారు. డ్రెయిన్లలో పూడిక తీయకపోవడం, ఛానలైజేషన్ చేయకపోవడం వల్లే ముంపు సమస్య వస్తుంది తప్ప చెరువుల తవ్వకం వల్ల కాదని చెప్పారు.
జె.పి: ఏం తల్లీ ఏం చదువుతున్నావు? నీకు తెలుస్తుందా ఇక్కడ ఏం జరుగుతోందో?
విద్యార్థిని : ఆలపాడులో తొమ్మిదో తరగతి చదువుతున్నాను సార్. మా చెరువుల గట్లన్నీ తెగ్గొట్టేస్తున్నారు ఇక మాకు చదువుకునే అవకాశం ఉండదు.
జె.పి: అమ్మా ఇక్కడ చెరువులన్నీ కొంతమంది పెద్దోళ్లు ఆక్రమించేసారంటున్నారు. నిజమేనా?
మహిళలు: అలాంటిదేమీ లేదు సార్. అన్నీ మా చెరువులే. వాటిని చేసుకునే స్తోమత లేక బయటవాళ్లకు లీజుకు ఇచ్చామంతే.
జె.పి: ఇక్కడ వ్యవసాయం చేసుకునే అవకాశం ఉందా?
గ్రామస్థులు: మేం అంతా చెరువులకే అలవాటు పడిపోయాం. అయినా ఇప్పుడు పండుతుందో లేదో తెలియదు.

## వడ్లకూటితిప్ప:

వడ్లకూటితిప్పలో గ్రామస్థులతో మాట్లాడారు. ఇప్పుడిప్పుడే అభివృద్ధి సాధిస్తున్న మీకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కొల్లేరు సమస్యను అధ్యయనం చేశాకా ఒక పరిష్కారాన్ని ఆలోచిద్దామని చెప్పారు. ముంపునకు కారణమైన చెరువులను తొలగించడం సమంజసమే కానీ ఆ పేరు చెప్పి మొత్తం చెరువులన్నీ ధ్వంసం చేస్తామంటూ అర్థం లేకుండా వ్యవహరించడం ఎంతమాత్రం తగదని డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు. వడ్లకూటితిప్పలో ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. కొల్లేరు ప్రాంతంలోని మత్స్య పరిశ్రమ వల్ల లక్షలాది మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి లభిస్తుందన్నారు. సంపద సృష్టిస్తున్న వాళ్లను కనీసం మనుషులుగా కూడా గుర్తించకపోవడం బాధకరమన్నారు. ఈ భూమిపై జీవించే హక్కు పుట్టిన ప్రతి జీవికీ ఉందన్నారు. ఒకరి లాభం మరోకరికి కష్టం కాకూడదన్నారు. ఒకరి కంటిని





కొల్లేటి పర్యటనలో మరో దృశ్యం

డా॥ జయప్రకాష్ నారాయణ్ కొల్లేరు పర్యటన

మరొకరు పొడవాలనుకుంటే లోకం మొత్తం గుడ్డిదై పోతుందన్నారు. సమన్వయం సాధించడం అవసరమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఇక్కడ జరుగుతున్నదంతా మనిషి నిద్రలో నడుస్తున్నట్లు ఉందని వ్యాఖ్యానించారు. దేశంలో సగటున చదరపు కిలోమీటరుకు 350 మంది జీవిస్తుంటే కొల్లేరులో సగటున 750 మంది జీవిస్తున్నారని తెలిపారు. జనమాధ్యమాలు ఆలోచనతో అందరి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సముచిత పాత్ర నిర్వహించాలని కోరారు. అధికారం ఉంది కదా అని కాగితాల మీద గీతలు గీస్తే విష పరిణామాలు వస్తాయని ఆయన హెచ్చరించారు. డ్రెయిన్లలో పూడిక ఎలా తీయగలం అనేది ఆలోచన చేయాలని కోరారు. అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని వెతకాలన్నారు. సమస్య పరిష్కారానికి మీరు ఏం చేయబోతున్నారంటూ విలేకర్లు ప్రశ్నించగా తానిప్పుడు ఏ నిర్ణయమూ చెప్పదలచుకోలేదని మొత్తం అధ్యయనం చేసిన తర్వాతే తన అభిప్రాయాలను వెల్లడిస్తానని ఆయన చెప్పారు. ప్రభుత్వం సంప్రదాయక జీవనం సాగించమని చెబుతుంది కాదా? అని విలేకరులు ప్రశ్నించగా 30ఏళ్ల క్రితం బతికినట్టు బతకమని చెప్పడం ఎంత వరకు సబబు మీరే ఆలోచించండి. అభివృద్ధి సాధిస్తుండగా అనాగరిక జీవనం సాగించమని చెప్పడం సరికాదని పేర్కొన్నారు. దున్నపోతు ఈనిందంటే దూడను కట్టేయమన్నట్టు పరిస్థితి తయారయిందని విమర్శించారు.

### పందిరిపల్లెగూడెం (కోటలంక)

పందిరిపల్లెగూడెంలో ఏర్పాటు చేసిన సభలో జె.పి. మాట్లాడుతూ నా దగ్గర మంత్రదండం లేదు.. అధికారమూ లేదు... హామీలు ఇవ్వలేను. వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు మాత్రమే ఇక్కడకు వచ్చానన్నారు. లోక్‌సత్తా రాష్ట్ర సమన్వయకర్త డి.వి.వి.ఎస్.వర్మ మాట్లాడుతూ ఇక్కడున్న వాస్తవ పరిస్థితులను ప్రపంచానికి తెలియచేయాల్సిన అవసరం ఉందన్నారు. రకరకాల కోణాల నుంచి సమస్యను విశ్లేషించాలన్నారు. అంతా కలిసి కట్టుగా సమస్యకు పరిష్కారాన్ని వెతకాలని పేర్కొన్నారు.

**జె.పి: మీ గ్రామంలో సొసైటీ భూములు ఎన్ని ఎకరాలు ఉన్నాయి.**

**గ్రామస్థులు: 150 ఎకరాలు.**

**జె.పి: చెరువులు తీసేస్తే మీకు ప్రత్యామ్నాయం ఏం ఉంది.?**

**గ్రామస్థులు: ఏమీ లేదు సార్. ఇదే మాకు ఆధారం**




చేపల చెరువులు గట్టు తీసి డ్రైనులు పూడుస్తున్న దృశ్యం

మహిళలు: ఎవరైనా కొడితే వెళ్లి తండ్రికి చెప్పుకుంటాం. అదే తండ్రే కొడితే ఎవరుతో చెప్పుకోవాలి. మీరే న్యాయం చేయాలి. మా బతుకులకు దారి చూపించాలి.

### గుమ్మళ్లపాడు:

పలువురు మహిళలు, గ్రామస్థులు తమ బతుకులు బాగు చేయాలంటూ వేడుకున్నారు. కనీసం ప్రజాప్రతినిధులకు కూడా చెప్పకుండా చేస్తున్నారంటూ గ్రామసర్పంచ్ వాపోయారు.

### శృంగవరప్పాడు :

డాక్టర్ జయప్రకాష్ నారాయణ్, లోక్‌సత్తా నాయకులు శృంగవరప్పాడులో గ్రామ పొలిమేరల్లోకి రాగానే వందలాదిమంది గ్రామస్థులు ఎదురేగి జె.పికి సాదర స్వాగతం పలికారు. తమ బతుకులు కొల్లేరు పాలు చేయద్దంటూ  కాళ్లమీద పడే ప్రయత్నం చేయగా జె.పి వారిని వారించారు. అధైర్యం వద్దు ముందడుగు వేయండంటూ ధైర్యం చెప్పారు. తమ సమస్యలు వివరిస్తూ పలువురు మహిళలు కళ్లనీళ్లు పెట్టుకున్నారు. సభకు వచ్చిన ప్రతీ ఒక్కరిలోనూ ఏదో తెలియని ఆందోళన తమ బతుకులు ఏం కానున్నాయో అనే ఆవేదన వ్యక్తమయింది.

### పైడిచింతపాడు

పైడిచింతపాడులో జరిగిన సభలో పలువురు మహిళలు మాట్లాడుతూ రాత్రనక పగలనకఎన్నో  కష్టాలు పడి చెరువులు తవ్వుకున్నాం... ఉన్నంతలో బాగా బతుకుతున్నాం ఇపుడు పొమ్మంటున్నారు ఏం చేయాలంటూ వాపోయారు. తమకు చావు తప్ప పరిష్కారం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మహత్యల వల్ల సమస్యకు పరిష్కారం దొరకదని సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని డాక్టర్ జె.పి సూచించారు.

### ప్రత్తికోళ్లలంక:

వాస్తవాలు జనం ముందుకు వెళ్లాలని ,ఇక్కడేదో జరిగిపోతుందంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరిగిపోతుందని డాక్టర్ జె.పి. అన్నారు. కొందరి ప్రయోజనం కోసం లక్షలమందిని బలి చేయడం సరికాదన్నారు. కొల్లేరు మత్స్యకారుల సంక్షేమ సంఘం నాయకుడు సైదు సత్యనారాయణ మాట్లాడుతూ తమ వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమను దొంగలుగా, ఆక్రమణదారులుగా అధికారులు చిత్రీకరిస్తున్నారంటూ వాపోయారు. కనీసం తమ బాధలను చెప్పుకునే అవకాశం కూడా ఇవ్వకుండా నిర్బంధం అమలు చేస్తున్నారన్నారు. కరెంటు  కూడా తీసేసి గ్రామాలను అంధకారం చేసారన్నారు.



కొల్లేటి పర్యటనలో మరో దృశ్యం

డా॥ జయప్రకాష్ నారాయణ్
కొల్లేరు పర్యటన

## కొక్కిరాయలంక:

కొక్కిరాయలంకలో మొండికోడు డ్రెయిన్‌ను పరిశీలించారు. ధైర్యంగా ఉండాలంటూ గ్రామస్థులకు చెప్పారు.

**జె.పి: డ్రెయిన్ మొత్తం పూడిపోయింది కాదా ? పూడిక, గుర్రపుడెక్క తీయడానికి ఏం చేయరా?**

గ్రామస్థులు: గతంలో ఎప్పుడో ఒకసారి చేసారు సార్ . మేమే అప్పుడప్పుడూ పూడిక తొలగించేవాళ్లం. కొల్లేరుకు పూర్వవైభవం అంటున్నారు కదా సార్. చెరువులన్నీ తీసేస్తే భవిష్యత్తులో మిగిలేది ఈ కిక్కిస గడ్డి, గుర్రపుడెక్క తప్ప ఏమీ మిగలవు. మొండుకోడు డ్రెయిన్ కొల్లేరుకు చాలా ప్రధానమైన డ్రెయిన్ సార్.

**జె.పి: మరి ఏం చేస్తున్నారు ?**

గ్రామస్థులు: అధికారులకు ఇవేవీ పట్టవు సార్. దాదాపు అన్ని డ్రెయిన్ల పరిస్థితి ఇంతే.

## మల్లవరం:

మల్లవరంలో కొద్దిసేపు ఆగి ఆక్కడి గ్రామస్థులను పలకరించారు. తన చేతిలో మంత్రదండం ఏమీ లేదు. అధికారమూ లేదు. వాస్తవ పరిస్థితుల్ని అధ్యయనం చేయడానికి మాత్రమే వచ్చానని చెప్పారు. చాలా మంది చెరువులు తీసేస్తే తమకు ఆత్మహత్యలే శరణ్యమంటూ వాపోతున్నారు. అంత కంటే తెలివితక్కువ పని ఉండదని ధైర్యంగా బతకాలని చెప్పారు.

## చెట్టున్నపాడు:

చెట్టున్నపాడు సర్పంచి బలే కాంతారావు మాట్లాడుతూ జలగం వెంగళరావు ప్రభుత్వం కొల్లేరులో పేదల ఉపాధి కోసం తవ్వించిన చెరువులను అన్యాయంగా కొట్టేస్తున్నారని వాపోయారు. గ్రామస్థులను ఉద్దేశించి జె.పి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం, అధికారుల పరిస్థితి చూస్తుంటే తుగ్లక్ పరిపాలన గుర్తుకు వస్తుందని ఎద్దేవ చేశారు. గతంలో తుగ్లక్ తన రాజధానిని ఢిల్లీనుంచి దేవగిరికి మార్చాలని అనుకున్నాడు. రాజధానిని మారిస్తే ఎవరికీ అభ్యంతరం లేదు. తనూ, అధికారులు వెళితే పర్వాలేదు. కానీ మొత్తం ప్రజలందరినీ ఢిల్లీనుంచి దేవగిరికి తరలించాడు. కొన్ని వందలమంది నడవలేక, అనారోగ్యంతోనూ మరణించారు. రాజధాని ఢిల్లీలో లేకపోతే శత్రురాజులు ఆక్రమిస్తారని భావించి మళ్లీ రాజధానిని దేవగిరి నుంచి ఢిల్లీకి మార్చారు. మళ్లీ జనం అంతా బయలు దేరారు. మిగిలిన వాళ్లు చనిపోయారు. ఇది జరిగి చాలా ఏళ్లయినా



గుర్రపు డెక్కతో డ్రైన్లు ఆ పైన చెరువు గట్లు తవ్వి పూడుస్తున్న తీరు

ఇప్పటికీ చెప్పుకుంటున్నాము అలా ఉంది ప్రస్తుత పరిస్థితి అంటూ విమర్శించారు. జీవించే హక్కును కాదనే అధికారం ఎవరికీ లేదన్నారు. కొల్లేరు సంఘ నాయకుడు కామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ మన సమస్యలు, బాధలు ప్రత్యక్షంగా చూసేందుకు జయప్రకాష్ నారాయణ్ గారు వచ్చారని చెప్పారు. ఈ సమస్యకు తప్పని సరిగా ఒక పరిష్కారం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

### ఆగడాల లంక:

భీమడోలు మండలం ఆగడాలలంకకు చేరుకునేటప్పటికి సుమారు రాత్రి ఎనిమిది గంటలు అయింది. రాత్రివేళకూడా మహిళలు భారీ సంఖ్యలో సభకు హాజరయ్యారు. కొల్లేరు నాయకుడు, గ్రామ మాజీ సర్పంచి ఘంటసాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గతంలో వ్యవసాయం చేసి నష్టపోవడంతో ప్రభుత్వమే తమను బలవంతంగా చేపల సాగుకు ప్రోత్సహించిందని చెప్పారు. మళ్లీ ప్రభుత్వమే పోలీసులను పెట్టి చెరువులు ధ్వంసం చేస్తుందని వాపోయారు. ఎన్నో బాధలు అనుభవించి ఇప్పుడిప్పుడే బాగుపడుతుంటే మళ్లీ వెనక్కి తీసుకువెళ్లడం ఎంతవరకు సమంజసమంటూ ప్రశ్నించారు. డాక్టర్ జె.పి. మాట్లాడుతూ 29ఏళ్ల క్రితం వైద్య విద్యార్థిగా కొల్లేరు ప్రాంతాన్ని పర్యటించినపుడు తన అనుభవాలను వివరించారు. ప్రజాస్వామ్యంలో కనీసం సమాచారం చెప్పకుండా రెండులక్షల మంది ప్రజల జీవితాలలో ఆడుకోవడం దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. ప్రజల జీవితాలను ముందుకు తీసుకువెళ్లాల్సిన ప్రభుత్వాలు మళ్లీ 30ఏళ్ల వెనక్కి తీసుకు వెళతామని చెప్పడం అర్థరహితమన్నారు.

### గుండుగొలను:

గుండుగొలనులో ప్రజలను కలిసారు. అక్కడి పరిస్థితుల్ని గ్రామస్థులు ఆయనకు వారు వివరించారు. కొల్లేరు ధ్వంసం వల్ల ఆర్థికలితో ఉంటున్నామని, పిల్లల చదువులు అర్థాంతరంగా ఆగిపోయాయని చెప్పారు. జిరాయితీ, బి.ఫామ్ పట్టాలను ధ్వంసం చేస్తున్నారని తమకు మనుగడ లేదని కంటతడి పెట్టారు. జె.పి. మాట్లాడుతూ తాము పరిస్థితిని అధ్యయనం చేయడానికి వచ్చామని అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని కనుక్కోవచ్చని చెప్పారు.

మొదటిరోజు కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల్లోని మొత్తం 14 గ్రామాల్లో పర్యటించారు. ప్రతీచోటా వందలాదిమంది ప్రజలు తరలివచ్చి తమ బాధలను, జరుగుతున్న విధ్వంసాన్ని వివరించారు. అన్ని వర్గాల ప్రజల సమస్యలను సావధానంగా విన్న జయప్రకాష్ నారాయణ్ ఆచరణ యోగ్యమైన , అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని కనుక్కుందామంటూ వారికి హామీ ఇచ్చారు.



గుర్రపు డెక్కతో నిండిన డ్రైను



చెరువుల నుండి చేపల ఎగుమతి

## రెండో రోజు పర్యటన

రెండో రోజు పర్యటనలో భాగంగా పత్తేపురంలో ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు, మాజీ మంత్రి చింతలపాటి వరప్రసాద మూర్తిరాజుగారిని ఆయన స్వగృహంలో కలుసుకున్నారు. కొల్లేరుకు సంబంధించిన సమస్యపై ఆయనతో చర్చించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన లోక్‌సత్తా జెండాను ఎగురవేశారు. అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేశారు. ఆముదాలపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ధ్వంసం చేసిన చెరువులను, జమిందారు కోడు డ్రెయిన్‌ను పరిశీలించారు. పెదనింద్రకొలనులో మూర్తిరాజుగారి సారధ్యంలో నిర్మించిన 'గాంధీ' భవనాన్ని సందర్శించారు. తోకలపల్లి, సిద్ధాపురంలలో గ్రామస్థులతో మాట్లాడారు. అక్కడనుంచి ఉప్పుటేరుపై లాంచీలో కొల్లేరును పరిశీలించారు.

### తోకలపల్లి:

డాక్టర్ జె.పి వస్తున్నారని తెలిసి గ్రామస్థులు, పెద్ద ఎత్తున జిరాయితీదారులు వచ్చారు. మీ సమస్యలు చెప్పండంటూ జె.పి. అక్కడున్న పెద్దవయసు వారిని అడగగా ఎర్రకొండులు అనే పెద్దాయన కొల్లేరు పరిస్థితి వివరిస్తూ "ముంపునకు ముందు-ఊడుపునకు వెనుక" అన్న చందంగా తమ పరిస్థితి ఉందని పేర్కొన్నారు. అక్రమ తవ్వకాల గురించి ప్రశ్నించగా తమ అనుమతి లేకుండా ఒక్క అంగుళం భూమి కూడా ఎవరూ ఆక్రమించుకోరని, తమ పరిస్థితి బాగోలేక తామే లీజుకు ఇచ్చామని చెప్పారు. డాక్టర్ జె.పి. మాట్లాడుతూ లంచాలు మింగి కొల్లేరులో చేపల చెరువులు తవ్వకానికి అనుమతి ఇచ్చారని ఆరోపించారు. అధికారుల అవినీతి, అర్థం పర్థం లేని నిర్ణయాలతో సమస్య జఠిలం అవుతుందన్నారు. ఏ మాత్రం అడ్డులేని భవనాల్ని సైతం కూల్చి వేసి తర్వాత పొరపాటై పోయిందంటూ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారంటూ ధ్వజమెత్తారు. నేల తల్లిని నమ్ముకున్న వాళ్లందరూ బాగుండాలని అన్నారు. రైతు ఏ ప్రాంతంలో ఉన్నా మేలు చేయాలని పేర్కొన్నారు. సంపద సృష్టిని అడ్డుకోవడం అన్యాయమన్నారు.

### సిద్ధాపురం:

ఉప్పుటేరు ముఖద్వారం వెడల్పు చేసి తూడు, గుర్రపుడెక్క , కిక్కిస తొలగిస్తే ముంపు సమస్య అసలు ఉండదని సిద్ధాపురంలో రైతులు జయప్రకాష్ నారాయణ్‌కు వివరించారు. ఇలా చేస్తే రెగ్యులేటర్ నిర్మాణం కూడా అవసరం లేదని పేర్కొన్నారు. అభయారణ్యం పేరుతో చెరువులో మట్టి తొలగించినా తమ చెరువుల్లో పుల్లలు ఏరుకున్నా కేసులు పెడుతున్నారని వాపోయారు. రైతుల పరిస్థితిని విన్న జె.పి. దీనిపై సమగ్రంగా అధ్యయనం చేసిన తర్వాత నిర్ణయం తీసుకోనున్నట్టు చెప్పారు. అక్కడ నుంచి ఉప్పుటేరులో లాంచీపై కొల్లేరును పరిశీలించారు.

# జీవించే హక్కు ను నాశనం చేసే అధికారం ఎవరికీ లేదు

కొల్లేటి సభలో
డా॥ జయప్రకాష్



ఆగడాల లంకలో కొల్లేరు సభ



# ఇది తుగ్లక్ పాలన

**కొల్లేటి సభలో డా॥ జయప్రకాష్**

**భుజం కలపండి**
**కదం తొక్కండి**
**గొంతు విప్పండి**
**బిడ్డల భవిష్యత్తును చూడండి**
**నడుస్తున్న చరిత్రను తిరగరాయండి**
**ఉదాత్తమైన పోరాటానికి సిద్ధం కండి**

ఇదీ కొల్లేరు ప్రజలకు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ ఇచ్చిన పిలుపు . కొల్లేరు వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేయడానికి ఆయన (మే 13, 14 తేదీల్లో ) కొల్లేటి గ్రామాల్లో పర్యటించారు . ఈ పర్యటన ముగింపు సందర్భంగా మే 14న పశ్చిమగోదావరి



కొల్లేటి సభలో ఒక దృశ్యం



కొల్లేటి సభలో వేలాదిమంది మహిళలు

జిల్లా గుడివాకలంకలో స్థానికులు ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. సభకు కొల్లేరు సంక్షేమ సంఘం నాయకుడు, మాజీ ఎం.ఎల్.సి కామినేని శ్రీనివాసు అధ్యక్షత వహించారు. రెండు లక్షలమంది ప్రజలను ముంచి కొల్లేరును ప్రక్షాళన చేస్తాననడం కచ్చితంగా మానవ హక్కులను ఉల్లంఘించడమే అని ఆయన స్పష్టం చేశారు . కొల్లేరుకు సంబంధించి కొన్ని అపోహలు ఉన్న మాట వాస్తవమేనని వాటి గురించి నిజాయతీగా మాట్లాడుకోవాలని సూచించారు. వాస్తవ పరిష్కారాలను కనుక్కోవాలన్నారు. పైన రైతులు మునిగిపోతుంటే కింది వారికి ఆనందం కాకూడదని ఆయన పేర్కొన్నారు. కేవలం చెరువుల తవ్వకం వల్లే మునక వస్తుందని అంటున్నారు. అదే నిజమైతే మునకకు అడ్డంకిగా ఉన్న చెరువులు ఏ కాంటూరులో ఉన్నా నిర్ధాక్షణ్యంగా తొలగించాలి. అలా కోరుకునేవాళ్లలో నేనే మొదట ఉంటాను. అలా కాకుండా చెరువులన్నింటిని ధ్వంసం చేస్తామంటున్నారు. మీ బాధలు మాకు అక్కర్లేదంటున్నారు... ఏం జరుగుతుందిక్కడ? అసలు ప్రజాస్వామ్యం అనేది ఇక్కడ ఉందా ? కనీసం ఏదైనా చేసేముందు ఆలోచిస్తున్నారా ? అసలు చెరువులను ఎందుకు తవ్వుతున్నారని అధికారులను ప్రశ్నిస్తే పొలాలు ముంపునకు గురవుతున్నాయంటున్నారు. వాస్తవంగా పరిశీలిస్తే .........మూడునుంచి ఐదో కాంటూరులోని 43,000 ఎకరాల్లో 1.5 టిఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంటుంది. కొల్లేరు పరీవాహక ప్రాంతం 12 లక్షల ఎకరాలు ఉంది. పైన ఉన్న ఆ ప్రాంతంలో 10 సెంటీమీటర్ల వర్షం కురిస్తే వచ్చే నీరు 15 టి.ఎం.సీలు. ఈ కొల్లేరు ఆ ముంపును ఎలా నివారిస్తుంది. అలాంటప్పుడు కొల్లేరు ప్రక్షాళన చేసి లాభమేమిటని ఆయన ప్రశ్నించారు. తప్పులు చేయడం మానవ సహజం. ఒక్కోసారి తెలిసో తెలియకో పొరపాట్లు చేస్తాం. దాన్ని సరిచేసుకునే అవకాశం ఉన్నప్పుడు తప్పని సరిగా సరిచేసుకునేందుకు ప్రయత్నించాలి. నిర్ణయాలన్నీ ప్రభుత్వం చేసి కోర్టుతీర్పు అంటూ తప్పించుకోవడం సమంజసం కాదని అన్నారు. ఇక్కడేదే జరిగిపోతుందని చిత్రికరిస్తూ ఇదో అంతర్జాతీయ సమస్యగా చిత్రీకరించడం బాధాకరం. ఇక్కడ ప్రజలు తమ బతుకులు తాము గౌరవంగా బతుకుతూ సంపద సృష్టిలో పాలుపంచుకుంటున్నారు. ఇక్కడి ప్రజలు స్మగ్లింగ్‌గానీ, దొంగనోట్లుకానీ ముద్రించడం లేదు అని ఆయన పేర్కొన్నారు. వలస పాలనలో ఏ గవర్నర్ కూడా ఈ విధంగా ప్రజలను ఇబ్బంది పెట్టలేదని పేర్కొన్నారు. ఇక్కడ రాజ్యాంగ విరుద్ధంగా పాలన సాగుతోందని ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్యమా, రాక్షస రాజ్యమా అంతు బట్టడం లేదన్నారు. దీనికంటే తుగ్లక్ పరిపాలన మేలన్నారు. కళ్లుండి చూడలేని, చెవులుండీ వినలేని, గుండె ఉండీ స్పందించలేని పరిస్థితుల్లో రాజకీయ పార్టీలు, పాలకులు ఉన్నారని తీవ్రంగా విమర్శించారు.



కొల్లేటి సభలో మరో దృశ్యం

కొల్లేరుకు పూర్వవైభవం తీసుకువస్తామంటున్నారు. ఏమిటీ పూర్వ వైభవం అంటే 29ఏళ్ల కిందట వైద్య విద్యార్థిగా కొల్లేరు గ్రామాల్లో వైద్యం చేయడానికి మరికొంతమంది వైద్యవిద్యార్థులతో కలిసి నేను వచ్చాను. అప్పటి వరకూ గోదావరి, కృష్ణా జిల్లాల్లో ప్రజలు బాగా అభివృద్ధి అయ్యారని మంచి సంపదా,సంస్కృతి ఉన్నాయని అనుకున్నాను. కానీ నేను ఇక్కడికి వచ్చాకా తెలిసింది ఇక్కడ ప్రజల పరిస్థితి చూశాక అర్థమైంది నా అభిప్రాయం ఎంత తప్పో. ఏ పిల్లాడి చేతులు చూసిన గజ్జి, ఎవరి శరీరం చూసినా పౌష్టికాహార లోపంతో ఒంటినిండా మచ్చలు ఇదీ నాటి పరిస్థితి. ఎవరి ఇంటికెళ్లినా మంచినీళ్లు ఇచ్చేవారు ప్రతీ గ్లాసులోనూ అంగుళం మందాన అడుగున ఎర్రమట్టి, ఒళ్లు కప్పుకోవడానికి ఒంటినిండా కనీసం బట్టకూడా లేని పరిస్థితి ఇదేనా పూర్వ వైభవం అంటే?. కాలుష్యం కోసం చెరువులు తీసేస్తున్నామని చెబుతున్నారు. అసలు కాలుష్యం ఎలా జరుగుతుంది. ఎవరి వల్ల జరుగుతుంది అని ఆలోచించారా? ఏలూరు నుంచి వస్తున్న మురుగునీరును బయటకు పంపించేందుకు ఏం చర్యలు తీసుకున్నారు ?. పెద్ద పెద్ద పరిశ్రమలు నుంచి వస్తున్న కాలుష్యాన్ని అరికట్టేందుకు ఏం ప్రయత్నం చేశారు ?. మీ చేతుల్లో అధికారం ఉంది దాన్ని ఉపయోగించి ఎంత పెద్దవారైనా కొల్లేరును కాలుష్యంతో నాశనం చేస్తుంటే ఆ పరిశ్రమల మీద చర్యలు తీసుకోండి. అలాంటివేవీ చేయకుండా చెరువులవల్ల కాలుష్యం పెరిగిపోయిందనే వాదన సరికాదు. పక్షుల కోసం కొల్లేరు ప్రక్షాళన అని మరోమారు చెపుతున్నారు. పక్షుల కోసం మానవ హక్కులను హరిస్తారా? జీవించే హక్కును నాశనం చేసే అధికారం ఏ ఒక్కరికి లేదు. విజ్ఞత ఉంటే అర్థమౌతుంది. ప్రపంచంలో అన్నింటి కంటే సంపద సృష్టించడమంత పవిత్రమైన పని మరొకటి లేదు. సంపద సృష్టించే వారిని కనీసం అలోచించకుండా ఒక్క కలం పోటుతో బయటకు పొమ్మని అంటే... ఇక్కడ ఎమర్జన్సీ నడుస్తున్నదా..? ఎవరి లాభం కోసం ఇదంతా చేస్తున్నారు.? ప్రత్యామ్నాయం చూపిస్తున్నామంటున్నారు ఏమిటి మీరు చూపించే ప్రత్నామ్నాయం 30 కోట్లు కేటాయించామని చెబుతున్నారు. రెండు లక్షల మందికి మీరిచ్చే పరిహారం ఒకొక్కరికి రూ.1500వస్తుంది. ఇదేనా ప్రత్యామ్నాయం అంటే ? కొల్లేరులో సగటున ఒక్కొక్కరి ఆదాయం 25వేలు. ఆ లెక్కన మీరు పరిహారం కోసం 6000కోట్లు బ్యాంకులో డిపాజిట్టు చేసి ఆ తర్వాత ప్రక్షాళన గురించి మాట్లాడండి. నర్మదా ప్రాజెక్టు గురించి మీ కందరికీ తెలిసిందే. ఆ ప్రాజెక్టు నిర్మాణం వల్ల నాలుగు రాష్ట్రాలకు లాభం చేకూరుతోంది. విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. లక్షలాదిమందికి ప్రయోజనం చేకూరుతుంది. ఆ ప్రాజెక్టువల్ల లక్షమంది నిర్వాసితులవుతున్నారు. వారికి పునరావాసం కోసం ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేస్తోంది. పట్టాలేకున్నా ప్రత్యామ్నాయంగా భూమి కేటాయిస్తోంది. అలాంటిది ఇక్కడ రెండు లక్షల మంది నిర్వాసితులు అవుతుంటే కనీసం మెడకాయమీద తలకాయ ఉన్న ఎవరైనా సరిగా ఆలోచిస్తారు.



కొల్లేటి సభలో మరో దృశ్యం

కానీ పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉంది. కనీసం ఇక్కడ పంచాయతీలకు కూడా ఏం చేస్తున్నారో చెప్పకపోవడం బాధాకరం. ప్రజాస్వామ్యంలో ప్రభువులం మనం మన సేవకులు వీరంతా. అలాంటిది ఏమాత్రం బాధ్యత లేకుండా చేస్తామని అంటే ఎలా? నాదాకా వస్తే మాత్రం పట్టించుకుంటాను లేకపోతే పట్టించుకోను అనడం ప్రజాస్వామ్యానికి ఎంతమాత్రం మంచిది కాదు. నేను తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌గా ఉండగా 1987 జులై 23న వచ్చిన వరదలకు లక్షలాదిఎకరాలు ముంపునకు గురయ్యాయి. పంట మొత్తం నాశనం అయింది. దీంతో వచ్చే పంటకు వరి వేసేందుకు పెద్ద ఎత్తున ఉద్యమంగా రైతులతో నాట్లు వేయించాం. ఆసంవత్సరం పంటలు విరగ పండాయి. కానీ వరదలు వచ్చినప్పుడల్లా మురుగునీరు పారక రైతులు పెద్ద ఎత్తున నష్టపోతున్నారు. ఈ సమస్య పరిష్కారం కావాలి. దీనికోసం ఒక సమగ్ర నివేదిక తయారు చేసి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి గారికి అందజేసాం. సాధారణంగా ముఖ్యమంత్రి నివేదిక చదవరని అనుకున్నాం. కానీ ముఖ్యమంత్రి నివేదిక మొత్తం చదివి నిధుల కోసం ప్రపంచబ్యాంకును అప్పు అడిగి డ్రెయిన్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేశారని ఆయన తెలిపారు. పూడికలు తొలగించి, డ్రెయిన్లు అభివృద్ధి చేయడం ద్వారా కొంతమేర ప్రయోజనం చేకూరిందని చెప్పారు. ఏ గ్రామం వెళ్లినా ప్రజలు కన్నీళ్ల పర్యంతమవుతున్నారు, ఆత్మహత్యలే తమకు శరణ్యమని వాపోతున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ధైర్యాన్ని కోల్పోకూడదని ఆయన సూచించారు. సమస్య పరిష్కారానికి ఆత్మహత్యలు ఎంతమాత్రం పరిష్కారం కాదని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్యయుతంగా సమస్య పరిష్కారానికి మార్గాన్ని వెతకాలని అన్నారు. ప్రజాస్వామ్యం మీద తనకు గౌరవం ఉందని పేర్కొంటూ ఎన్ని లోపాలు ఉన్నా కచ్చితంగా పరిష్కారాలు మన వ్యవస్థలో ఉన్నాయన్నారు. తెలిసి తెలిసీ ఏ ప్రభుత్వమూ, అధికారులు ప్రజలకు అన్యాయం చేయాలని అనుకోరు. అయితే కొన్ని పొరపాట్లు జరుగుతాయి. వాటిని తెలియజెప్పే ప్రయత్నం చేయాలని అన్నారు.

కొల్లేరు సమస్యను పరిష్కరించేందుకు డాక్టర్ జె.పి కొన్ని ప్రతిపాదనలు చేశారు.

1. కాంటూరుతో నిమిత్తం లేకుండా పల్లంగా ఉన్న మొత్తం ప్రాంతంలో మురుగునీటి పారుదలకు అడ్డంగా ఉన్న చెరువులు, నిర్మాణాలను నిర్దాక్షణ్యంగా తొలగించాలి. ముంపునకు సంబంధం లేని వాటిని ముట్టుకోరాదు.
2. ఎగువనుంచి కొల్లేరులోకి పరిశ్రమలనుంచి,మున్సిపాలిటీల నుంచి వస్తున్న కాలుష్యాన్ని అడ్డుకోవాలి.
3. గుర్రపుడెక్క, కిక్కిస వంటి మొక్కలను యుద్ధ ప్రాతిపదికన తొలగించే చర్యలు చేపట్టాలి.
4. ప్రతీ ఏటా 1-2 అడుగుల మెరక పెరుగుతున్నందున మళ్లీ కాంటూరుల సర్వేను శాస్త్రీయంగా ,హేతుబద్దంగా అందరికీ తెలిసేలా చేయాలి.



కొల్లేటి సభావేదిక

5. ఎలాంటి చర్యలు చేపట్టినా ప్రజలకు ప్రస్తుతం వస్తున్న ఆదాయం మేరకు దానికి అనుగుణంగా పునరావాసానికి అవసరమైన లెక్కలు వేసి ఆ డబ్బును బ్యాంకులో జమచేయలి.
6. మూడో కాంటూరులో చెరువులు కాని, వ్యవసాయం కాని లేవు. ఇప్పటికే పల్లంగా ఉంది. అక్కడి వరకూ సరస్సుగా చేయండి. అయితే అక్కడ బలహీన వర్గాలకు, పేదలకు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయండి. ఇవన్నీ చేశాక అప్పుడు గోదాంలోకి దిగండి.

శాంతియుతంగా తమ నిరసన వ్యక్తం చేస్తూనే కొల్లేరు వాసులు మూడు పనులు చేయాలని ఆయన కోరారు.

1. గ్రామ గ్రామాన రిఫరెండమ్‌ను నిర్వహించాలి. దీనిలో కొన్ని ప్రశ్నలను అడగాలి. గత జీవితం బాగుందా? మంచి జీవనం కావాలనుకుంటున్నారా?. మురుగునీటి పారుదలకు అడ్డువచ్చిన వాటిని తొలగించాలా లేదా? అనే ప్రశ్నలను అడగాలి. ప్రతీ గ్రామంలో ప్రజలు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వెల్లడించే అవకాశం ఇవ్వాలి.
2. మురుగునీటి కాలువలకు ఉన్న అడ్డంకుల వివరాలను శాస్త్రీయంగా ,సాధికారికంగా డాక్యుమెంట్ రూపంలో తయారు చేయాలి.
3. కొల్లేరు ప్రాంత మానవ హక్కుల రక్షణ సంఘాన్ని ఏర్పాటు చేయాలి.

ఎట్టి పరిస్థితుల్లోనూ హింసకు తావివ్వకుండా శాంతియుతంగా నిరసన వ్యక్తం చేయాలని కొల్లేరు వాసులను కోరారు.

లోక్‌సత్తా రాష్ట్ర సమన్వయకర్త డి.వి.వి.ఎస్.వర్మ ప్రసంగిస్తూ సమస్యతోపాటే పరిష్కారం ఉంటుందన్నారు. మంచి జీవితం ఇచ్చే పరిష్కారాన్ని వెతకాలని అన్నారు. తెలివి ఉన్న ఎవరైనా సరే ఇంకా ముందుకు వెళ్లాలని, అభివృద్ధి సాధించాలని కోరుకుంటారు. కానీ మన పాలకులు, అధికారులు మిమ్మల్ని మళ్లీ వెనక్కి వెళ్లమంటున్నారు. ఇది ఎంతమాత్రం సమంజసం కాదు. ఆలోచనా పరులు ముందుకు తీసుకువెళ్లడానికి ప్రయత్నిస్తారు. పాలకులు కనీసం ఆలోచించకుండా నిర్ణయాలు చేస్తున్నారంటూ ఆయన విమర్శించారు. కొల్లేరు ప్రజలు తమ మనస్సుల్లో ఉన్న బాధను కళ్లద్వారా తెలిపారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం చూపిన ఉపాధిని ఆధారం చేసుకుని సొంత కష్టంతో మీరు అభివృద్ధి అయ్యారు. రోడ్లు, ఇతర సదుపాయాలు వచ్చాయి అవన్నీ వదిలిపెట్టి గోచీ బతుకులు, నత్తమాంసం, తూటికూర రోజులు తీసుకు వస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కనీసం మేం ఇది చేస్తున్నామని చెప్పే పరిస్థితి కూడా లేదన్నారు. కొల్లేరు ప్రజలపై పాలకులు



గోడు వివరిస్తున్న మహిళ

దుద్దుకర్ర పాలన సాగిస్తున్నారని ఆయన విమర్శించారు. ఇది చాలించాలని హితవు పలికారు.సేవకులుగా బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. పరిపాలన చేసేవాళ్లు ప్రజల ఇబ్బందులను ఆలోచించాలి, వారి అవసరాలను పట్టించుకోవాలని అన్నారు. కొల్లేరు ప్రక్షాళన పేరుతో చెరువులను ధ్వంసం చేస్తే కిక్కిసగడ్డి పెరగడం తప్ప ఏ మాత్రం ప్రయోజనం ఉండదన్నారు. కృష్ణా జిల్లా పరిషత్తు మాజీ ఛైర్మన్ పిన్నమనేని కోటేశ్వరరావు మాట్లాడుతూ కొల్లేరు ప్రజల ఆర్థిక పరిస్థితిని మార్పు చేసేందుకు తానూ, మరికొంతమంది కలిసి ఎంతో కృషి చేశామన్నారు. వెంగళరావుగారు ముఖ్యమంత్రిగా ఉండగా చెరువులు తవ్వుకునేందుకు అనుమతి తీసుకువచ్చామన్నారు. ప్రతీ ఊరు తిరిగి చెరువులు తవ్వేలా చైతన్యం తీసుకువచ్చేందుకు అప్పటి జిల్లా కలెక్టర్ సంతానంగారితో కలిసి ఎంతో ప్రయత్నం చేశామన్నారు. ఎవరూ ముందుకు రాకపోవడంతో సొంతంగా చెరువులు తవ్వి చూపించామని, చేపలను కేజీ ఐదు రూపాయలకు కలకత్తాకు ఎగుమతి చేసేవారమని చెప్పారు. చెరువుల వల్ల ప్రజల జీవితాల్లో ఎంతో మార్పు వచ్చిందన్నారు. మళ్లీ వెనక్కి తీసుకువెళతామని అనడం సమంజసం కాదన్నారు. జిరాయితీ భూములను, సొసైటీ భూములను కూడా ధ్వంసం చేస్తామనడం అర్థం లేదన్నారు. వెంటనే ఈ చర్యలకు స్వస్తి చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. సభాధ్యక్షుడు శ్రీనివాసు మాట్లాడుతూ కొల్లేరు ధ్వంసాన్ని అడ్డుకోవడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రభుత్వం దిగిరాకపోవడంతో చివరి ప్రయత్నంగా లోక్‌సత్తా జాతీయ సమన్వయకర్త డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ గారిని కలిసి తమ సమస్య విన్నవించామన్నారు. సమస్యను ప్రత్యక్షంగా చూసిన తర్వాతే తన నిర్ణయం చెబుతానన్నారు. దాని ప్రకారమే రెండు రోజులు కొల్లేరు గ్రామాల్లో ఆయన పర్యటించారన్నారు. ప్రత్యక్షంగా తమ బాధలను చూసిన ఆయన సరైన ప్రత్యామ్నాయాన్ని చూపించగలరన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కొల్లేరు గ్రామానికి చెందిన ఒక మహిళ మాట్లాడుతూ తమ జీవనోపాధిని అడ్డుకుంటున్నారంటూ వాపోయారు. తమకు ఇది తప్ప మరో ప్రత్యామ్నాయం లేదని, తామ నోటికాడ కూడు పడగొట్టద్దంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. మత్స్యకార్మికుల సంక్షేమ సంఘం నాయకులు సైదు సత్యనారాయణ, జయమంగళ రామారావు మాట్లాడుతూ ప్రభుత్వం అప్రజాస్వామికంగా తమ చెరువులను ధ్వంసం చేసి తమను రోడ్డున పడేస్తున్నదని వాపోయారు. ముంపునకు అడ్డువచ్చే చెరువులను ధ్వంసం చేయడానికి తమకు ఎటువంటి అభ్యంతరం లేదని పేర్కొన్నారు. కనీసం తమ వాదనను వినేందుకు కూడా ప్రభుత్వమూ, అధికారులు సిద్ధంగా లేరని అంతా వారిష్ట ప్రకారమే జరుగుతున్నదన్నారు. ఎవరైనా మాట్లాడితే ఎన్‌కౌంటర్ చేస్తామంటూ బెదిరిస్తున్నారని తెలిపారు. ప్రత్తికోళ్లలంక సర్పంచ్ మహలక్ష్మిరాజు తదితరులు మాట్లాడారు. లోక్‌సత్తా కృష్ణాజోన్ కో ఆర్డినేటర్ డాక్టర్ పాలడుగు చంద్రమౌళి, లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు గొట్టుముక్కల జానకిరామరాజు, ట్రైనింగ్ కో ఆర్డినేటర్ సాగిరాజు జానకిరామరాజు, జిల్లా ఉపాధ్యక్షురాలు ఎస్.మనోరమ తదితరులు పాల్గొన్నారు.

# కొల్లేరు సంగ్రహ చిత్రం

| | ఎకరాలు | విస్తీర్ణం |
|---|---|---|
| + 3' సముద్ర మట్టానికి (కాంటూరు) | 33,750 | 125 చ.కి.మీ |
| + 5' కాంటూరు | 77,138 | 303 చ.కి.మీ |
| + 7' కాంటూరు | 1,68,750 | 598 చ.కి.మీ |
| + 10' కాంటూరు | 2,25,250 | 850 చ.కి.మీ |

## కొల్లేరులో భూ వినియోగ స్థితి

| + 5' కాంటూరు లోపల | 4-10-99 | 1-1-2006 |
|---|---|---|
| ప్రకటించిన విస్తీర్ణం | 77,138 | 77,138 ఎకరాలు |
| ఎ) ప్రభుత్వ భూములు | | |
| చేపల చెరువులు (డి- పట్టాలు, ఆక్రమణలు) | 15,899 | 31,234 ఎకరాలు |
| వ్యవసాయ భూములు (డి- పట్టాలు, ఆక్రమణలు) | 12,011 | 5,400 ఎకరాలు |
| వినియోగంలో లేని భూమి | 29,663 | 20,939 ఎకరాలు |
| | 57,573 | 57573 |
| బి) ప్రయివేటు భూములు (జిరాయితీ) | | |
| చేపల చెరువులు | 6650 | 7,210 ఎకరాలు |
| వ్యవసాయ భూములు | 12,915 | 12,355 ఎకరాలు |
| | 19,565 | 19,565 |
| మొత్తం ఎ+బి | 77,138 | 77,138 |

4-10-99 ప్రభుత్వ ఉత్తర్వులలో ప్రకటించిన గ్రామాల సంఖ్య : 74



మొత్తం గ్రామాల జనాభా సుమారు 2,00,000

# కొల్లేటి ప్రజల నినాదాలు

చెరువు కట్టలు కొట్టకండి
కొంప కొల్లేరు పాలు చెయ్యకండి

వలస పక్షుల విడిది కోసం
కొల్లేటి ప్రజల్ని వలసపాలు చెయ్యకండి

ప్రజల జీవనం కన్నా
పక్షుల విడిది మిన్నా ?

కాలచక్రాన్ని వెనక్కి తిప్పకండి
కొల్లేరును చీకటి పాలు చెయ్యకండి

గోచిగుడ్డ, దోనె బతుకు
గత వైభవం మా కొద్దు

చెరువు కట్టలు తెంచకండి
కొల్లేటి ప్రజల కడుపు కొట్టకండి




కూడు పెట్టాలని చెరువులు తవ్వించింది ఒకనాటి ప్రభుత్వం
తినే కూడు తీసెయ్యాలని చెరువుల్ని కొడుతున్నది ఈ ప్రభుత్వం

# కొల్లేరు గ్రామాల్లో ప్రజాభిప్రాయసేకరణ

## నిర్వహణ : సెంటర్ ఫర్ మీడియా స్టడీస్

## కార్యక్రమం

1. పోలింగ్ సిబ్బంది శిక్షణ : 28 మే (ఏలూరు)
2. వలంటీర్ల శిక్షణ : మే 30 (మొదటి గ్రూపు గ్రామాలు) - మే 31 (రెండవ గ్రూపు గ్రామాలు) (ప్రతీ గ్రామం నుండి ఐదుగురు వలంటీర్లు)
3. పోలింగ్ తేదీలు : (ఉదయం 7గం- సా 5గం) : జూన్ 1 మొదటి గ్రూపు గ్రామాలు, జూన్ 2 రెండవ గ్రూపు గ్రామాలు

---

## కొల్లేరు గ్రామాల్లో ప్రజాభిప్రాయసేకరణ

నిర్వహణ: సెంటర్ ఫర్ మీడియా స్టడీస్

బ్యాలట్ నెం:

మండలం: గ్రామం: తేదీ : 2006 జూన్......

పేరు:

సంతకం/నిశాని:

పోలింగ్ నిర్వహించిన వారి సంతకం

---

బ్యాలట్ నెం:

అంశం : 1 కొల్లేరుకు పై నుండి వచ్చే మురుగు కాల్వల ప్రవాహానికి అడ్డంగా ఉన్న అన్ని గట్లు, చెరువులు, ఆక్రమణలన్నింటినీ....

తొలగించాలి 

తొలగించకూడదు 

అంశం : 2 కొల్లేరులో ఎలాంటి జీవనాన్ని కోరుకుంటున్నారు.

ప్రస్తుత జీవన సరళి కొనసాగించాలి 

30 ఏళ్ల కిందటి పరిస్థితి రావాలి 